మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహాచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా భైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏక్రాలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యనారాయణ, సుగుణ, వెంకటేశ్ అ క్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

- మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణిగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

చంద్రశేఖర్

నరేశ్‌రెడ్డి

మాచారానికి చెందిన చంద్రశేఖర్..

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

గిర్మాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. – నేరేడుచర్ల

- గుండూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ధర్నా

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు – కల్వకుర్తి రూరల్

సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. మరో ఇద్దరు ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది.

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి, అక్టోబర్ 1: హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

జాబితా రాలేదు.. వెరిఫికేషన్ కాలేదు!

తెలంగాణ చౌక్, అక్టోబర్ 1: ఉపాధ్యాయుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2024కు సంబంధించిన ఫలితాలు సోమవారం విడుదల కాగా, మంగళవారం నుంచి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా అధికారులు పేర్కొన్నారు. కాగా, నిజానికి ఎంపికైన అభ్యర్థుల జాబితా లిస్టు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సంబంధిత శాఖ నుంచి విడుదల చేయాలి. అయితే, సాయంత్రం వరకు కూడా జాబితా రాకపోవడవడంతో జిల్లా కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌కు ఉదయం వచ్చిన అభ్యర్థులు నిరాశకు గురై వెనుదిరిగారు. జిల్లా వ్యాప్తంగా 151 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున అభ్యర్థులను సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌ను మంగళవారం నుంచి శుక్రవారం (ఈ నెల 4వ తేదీ) వరకు నిర్వహించాలి. కానీ, ప్రభుత్వం నిబంధనల ప్రకారం లిస్టు రాకపోవడంతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులు, తమ కుటుంబ సభ్యులతో ఉయదం నుంచి సాయంత్రం వరకు అక్కడే కూర్చొని ఎదురుచుశారు. ఫలితాలు విడుదల చేసిన మరుసటి రోజు నుంచే సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేస్తామని అధికారులు పిలవడంతో కొందరు అభ్యర్థులు అసహం వ్యక్తంచేశారు. ఇలా మరుసటి రోజు వెరిఫికేషన్ చేస్తే కొన్ని అవసరమైన సర్టిఫికెట్లు అందుబాటులో లేక ఆందోళకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై డీఈవో రమేశ్‌కుమార్‌ను వివరణ కోరగా ఈరోజు వెరిఫికేషన్ చేయడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, కానీ పైనుంచి సంబంధితశాఖ అధికారులు తమకు ఎంపికైన అభ్యర్థుల జాబితా పంపించకపోవడం వల్ల చేయలేకపోయమని పేర్కొన్నారు.

వయోవృద్ధుల దినోత్సవం

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 1: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన పట్టణ సీఐ కృష్ణను ఉద్యోగుల సంఘం బాధ్యులు శాలువాతో సత్కరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగుల కు ఏవైనా సమస్యలుంటే, తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. ఇక్కడ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తన్నీరు వెంకటలక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి జోగినిపల్లి మోహన్‌రావు, గౌరవాధ్యక్షుడు శంకరయ్య ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 1: మండల కేంద్రంతోపాటు మండెపల్లిలోని డే కేర్ సెంటర్లలో మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని జిల్లా సంక్షేమశాఖ అధికారి పోచంపల్లి లక్ష్మీరాజం ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహించారు. ఆయా వృద్ధాశ్రమాల్లో వృద్ధులతో ఇండోర్ గేమ్స్ ఆడించారు. ఇక్కడ వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ ముచ్చ మమత ఉన్నారు.

మోటర్ రిపేర్ చేస్తుండగా..

- ప్రమాదవశాత్తు రైతుకు కరెంట్‌షాక్
- కాలువలో పడి గల్లంతు

బోయినపల్లి, అక్టోబర్ 1: విద్యుత్ మోటర్‌ను రిపేర్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు ఓ రైతుకు కరెంట్‌షాక్ రావడంతో పక్కనే ఉన్న వరద కాలువలో గల్లంతయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొదురుపాక గ్రామానికి చెందిన నాగుల కిషన్ (35) దేశాయిపల్లిలో ఓ రైతుకు చెందిన భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం విద్యుత్ మోటర్‌కు మరమ్మతులు చేస్తుండగా, కరెంట్‌షాక్ రావడంతో వరద కాలువలో పడ్డాడు. అక్కడే ఉన్న స్థానికులు కుటుంబ సభ్యులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్ ఘటనాస్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో గాలించినా కిషన్ ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

ప్రభుత్వ తీరుతో రైతులకు నష్టం

వీర్నపల్లి, అక్టోబర్ 1: కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతు సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు మాచర్ల హరీశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భరోసా పెట్టుబడి సాయం అందించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రబీ సీజన్ మొదలవుతున్న కూడా ఇంతవరకు నిధులు విడుదల కాకపోవడం శోచనీయమన్నారు. కమిటీలు, అభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన చేయడంతో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రైతుబంధు పేరును రైతు భరోసాగా మార్చిన ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అన్నదాతలను నష్టపరిస్తే ఊరుకునేది లేదని మండిపడ్డారు.

ఓరుగంటి పరామర్శ

ఇల్లంతకుంట, అక్టోబర్ 1: వెల్జీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత గుండ ముత్తయ్య తల్లి ఎంకవ్వ వారం క్రితం మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మాజీ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు చంద్రమౌళి, రాజశేఖర్, సుధాకర్, బాలగౌడ్, నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, మురళీ, అంజయ్య, తదితరులు ఉన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 1: తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లె శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది. మంగళవారం ట్రాక్టర్లతో ప్రభుత్వ భూమిలో జేసీబీతో మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతుల్లేకుండా మట్టి తరలించడంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. అప్పటికే మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల ఫొటోలు, జేసీబీ వాహనం, మట్టి తవ్విన ప్రాంతం ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు

గంభీరావుపేట, అక్టోబర్ 1: కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అక్షయ, రామకిరణ్, శ్రీహర్షిణి, స్వాతి, లక్ష్మీసందీప్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం వెంకటరామారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారాయణపేటలో ఈ నెల 3 నుంచి 5 వరకు నిర్వహించే పోటీల్లో వారు పాల్గొంటారన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని నిరసన

ముస్తాబాద్, అక్టోబర్ 1: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కళాశాల సాధన కమిటీ కన్వీనర్ చింతోజి బాలయ్య ఆధ్వర్యంలో పోస్టుకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం కార్యాలయానికి పోస్టు కార్డులు పంపుతున్నట్లు తెలిపారు.

ఆత్మీయ సత్కారం

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 1: తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్‌ను మంగళవారం సిరిసిల్ల పద్మశాలీ, వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల నాయకులు సన్మానించారు. ఈ మేరకు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు గానూ స్థానిక చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో పద్మశాలీ, వస్త్ర వ్యాపార అనుబంధ ప్రతినిధులు, కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఇక్కడ సిరిసిల్ల పద్మశాలీ, చేనేత వస్త్ర వ్యాపార సంఘం, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం నాయకులు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

వేములవాడ, అక్టోబర్ 1: రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగిందని బీజేపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య ఆరోపించారు. సోమవారం భీమేశ్వర గార్డెన్‌లో ఆఫీస్ బేరర్లతో సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు సామాన్య ప్రజలను కూడా మెప్పించలేకపోతుందని చెప్పారు. సంక్షేమ పథకాల హామీలను అమలు చేయకుండా సామాన్య ప్రజలను ఇబ్బందులు గురిచేస్తున్నదని మండిపడ్డారు. ఇక్కడ బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, డాక్టర్ చెన్నమనేని వికాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

సిరిసిల్ల రూరల్: బతుకమ్మ సంబురాల్లో సరస్వతి శుభోదయ పాఠశాల విద్యార్థినులు

గంభీరావుపేట: ఆక్స్ ఫర్డ్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

వేములవాడ టౌన్: హంసిని స్కూల్‌లో ..

రామరామ రామ ఉయ్యాలో ..

- పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు
- సంబురంగా ఆడిపాడిన ఉపాధ్యాయులు, విద్యార్థినులు

జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు జరుపుకొన్నారు. విద్యార్థినులు తీరొక్క పూలతో ఉత్సాహంగా బతుకమ్మ పేర్చారు. 'రామరామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. అంటూ పాఠశాలలు, కళాశాలల ఆవరణలో మహిళా ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థినులు సంబురంగా ఆడిపాడారు. అనంతరం సమీప చెరువులు, కుంటలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

– రాజన్న సిరిసిల్ల నెట్‌వర్క్, అక్టోబర్ 1

ఇల్లంతకుంట: బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

చందుర్తి: సనుగుల ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

వేములవాడ రూరల్: చెక్కపల్లి జడ్పీహెచ్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

రుద్రంగి: జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తెలంగాణ చౌక్: శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..

సిరిసిల్లలో స్వచ్ఛతా ర్యాలీ

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 1: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్లలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫస